ప్రజాశక్తి

బుధవారం 28 మే 2025 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా



విజయవాడ అంబేద్కర్ స్మృతివనం వద్ద ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు; ర్యాలీలో సమైక్యతకు చిహ్నంగా పాల్గొన్న హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల ప్రతినిధులు (అంతర్‌చిత్రంలో)

ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా ఎదుర్కోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

వార్త మెయిన్‌లో

హెల్త్ అసిస్టెంట్ల బదిలీల్లో గందరగోళం

- కౌన్సెలింగ్ కోసం పడిగాపులు పడిన ఉద్యోగులు
- ఎట్టకేలకు రాత్రి 9.30 గంటలకు ప్రారంభం



కౌన్సెలింగ్ కోసం పడిగాపులు పడుతున్న హెల్త్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఉమ్మడి కష్ణాజిల్లా పరిధిలో జరగాల్సిన హెల్త్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ గందరగోళానికి దారి తీసింది. తమ పరిధిలో పోస్టుల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితో జరిగిన చర్చల్లో ఎన్టీఆర్ జిల్లా ఉద్యోగులు పట్టుపట్టడంతో కౌన్సెలింగ్ ప్రక్రియలో గందరగోళం ఏర్పడింది. దీనిపై పలుమార్లు ఆ ఉద్యోగులతో సంప్రదింపులు జరిపినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ప్రకటించి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఉమ్మడి కష్ణా పరిధిలో మంగళవారం నిర్వహించాల్సింది హెల్త్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ గందరగోళం మధ్య ముగిసింది. ఉమ్మడి కష్ణా జిల్లా పరిధిలో కష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలున్నాయి. వీటి పరిధిలో 170 మంది హెల్త్ అసిస్టెంట్లు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ (మిగతా 2లో)

'మనమిత్ర' సేవలపై అవగాహన

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ
- పారిశ్రామిక యూనిట్లకు రూ.4.13 కోట్ల ప్రోత్సాహకాలకు ఆమోదం



ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం యాప్ ఆధారిత డిజిటల్ వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర) ద్వారా ప్రజలకు 500కు పైగా సేవలు అందిస్తోందని, ఇందులో అందుబాటులోని పారిశ్రామిక సేవలపై పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక సంఘాలకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకుని ప్రోత్సహించాలని (మిగతా 2లో)

8 లక్షల టన్నుల ఇసుక నిల్వ చేయాలి

- కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఈ నెలాఖరుకు జిల్లాలోని 6 స్టాక్ పాయింట్లలో 8 లక్షల టన్నుల ఇసుకను నిల్వచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. స్టాక్ యార్డ్ వద్ద ప్రజలు ఇసుక కొనుగోలు చేసేందుకు వీలుగా కలెక్టర్ అధికారులతో చర్చించి ధరలు నిర్ధారించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వచ్చే వర్షాకాలానికి (మిగతా 2లో)

ఆస్తి పన్ను రీ సర్వే రద్దుకు కౌన్సిల్ తీర్మానించాలి

- విఎంసి మేయర్ భాగ్యలక్ష్మికి సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు వినతి
- రీ సర్వేతో నగర ప్రజలపై రూ.45 కోట్ల మేర అదనపు భారం



మేయర్ రాయన భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ : ఆస్తి పన్ను పెంపునకు చేస్తున్న రీ సర్వే సర్క్యులర్‌ను రద్దు, గత ఏప్రిల్‌లో పెంచిన 15 శాతం ఆస్తి పన్ను నిలుపుదల, ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దు తదితర అంశాలపై చర్చించడానికి అత్యవసరంగా కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మికి నగర పాలక సంస్థలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మిని ఆమె ఛాంబర్లో సత్యబాబు మంగళవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సత్యబాబు తన ఛాంబర్లో మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన ఆస్తి పన్ను, మంచినీరు, డ్రైనేజీ ఛార్జీలతోపాటు ఇతర పలు రకాల పన్నుల భారాలతో నగర ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. ఇవి చాలవన్నట్లు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, నగరాల్లో నివాస, వాణిజ్య, వ్యాపార భవనాల కొలతలు, రీ- సర్వే నిర్వహించి, ప్రస్తుత ఆస్తి పన్ను కనీసం 20 శాతం తగ్గకుండా పెంచాలని టిడిపి కూటమి ప్రభుత్వం నిర్ణయించడం దారుణమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలతో ఎన్నికైన కౌన్సిల్ సభ్యుల అభిప్రాయాలను స్వీకరించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం పూర్తిగా చట్ట వ్యతిరేకమన్నారు. అప్రజాస్వామికం, నియంతృత్వ చర్య అని మండిపడ్డారు. విఎంసి చర్యతో ప్రస్తుత ఆస్తి పన్నుపై ఆదనంగా కనీసం రూ.45 కోట్ల మేర భారం నగర ప్రజలపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎపి మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955 సెక్షన్ -220 -ఎ (1) ప్రకారం ఆస్తి పన్ను పెంపు, జరిమానా విధింపు వంటి నిర్ణయాలు చేసే అధికారం నగర కౌన్సల్‌కు మాత్రమే ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ ఆదేశాలను అమలు (మిగతా 2లో)



గద్దె అనురాధ సమక్షంలో టిడిపిలో చేరిన 9వ వార్డు వైసిపి కౌన్సిలర్ మూడు దుర్గారావు

మరో ఇద్దరు వైసిపి కౌన్సిలర్లకు గాలం?

ప్రజాశక్తి - తిరువూరు : బలం లేకపోయినా వైసిపి సభ్యులను కొనుగోలు లేదా ప్రలోభాలు చేసైనా తిరువూరు నగర పంచాయతీని ఎలాగైనా హస్తగతం చేసుకునేందుకు టిడిపి వేగంగా పావులు కదుపుతోంది. ఈనెల 19, 20 తేదీల్లో జరగాల్సిన చైర్మన్ ఎన్నిక రద్దయిన నేపథ్యంలో జూన్ 2న జరిగే ఎన్నికపై దృష్టి సారించింది. ఇటీవల జరిగిన చైర్మన్ ఎన్నిక సమయంలో ఐదుగురు వైసిపి సభ్యులకు ఆశచూపి తమ వైపు తిప్పుకున్న విషయం తెలిసిందే. వారిలో ముగ్గురు సభ్యులు టిడిపి కండువాలు కప్పుకోగా, మరో ఇద్దరు ఆ పార్టీకి మద్దతు తెలిపారు. ఈ ఐదుగురుతోపాటు ముగ్గురు టిడిపి సభులతో (మిగతా 2లో)

హెల్త్ అసిస్టెంట్ల బదిలీల్లో గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించి బదిలీల ప్రక్రియ చేపట్టారు. అయితే ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ రాత్రి 9 గంటలు దాటినా ప్రారంభంకాలేదు. దీనికి ఎన్టీఆర్ జిల్లా హెల్త్ అసిస్టెంట్లే కారణమని కృష్ణా, ఏలూరు జిల్లాల ఉద్యోగులు చెబుతున్నారు. విజయవాడ నగర పరిధిలో పోస్టుల సంఖ్య పెంచాలని ఉదయం నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జరిగిన చర్చల్లో పట్టుపట్టారు. అయితే నిబంధనల ప్రకారమే బదిలీలు నిర్వహిస్తామని వైద్య ఆరోగ్యశాఖ అధికారి చెప్పడంతో విషయం హెల్త్ డైరెక్టర్ దష్టికి చేరింది. కృష్ణా, ఏలూరు జిల్లా బదిలీల ప్రక్రియ పూర్తి చేసి ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించిన ప్రక్రియ ఆ జిల్లాకే వదిలేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకెళ్లి తదుపరి కౌన్సెలింగ్ తేదీ ప్రకటిస్తామని వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రకటించి వెళ్లిపోయారు. అయితే చివరకు ఎన్టీఆర్ జిల్లా ఉద్యోగులు నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టడానికి అంగీకరించడంతో రాత్రి 9.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభించారు.

సీనియారిటీ జాబితా ప్రచురణపై ఉద్యోగుల ఆగ్రహం

బదిలీలకు సంబంధించి ప్రచురించిన సీనియారిటీ జాబితాపై పలువురు ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆమోదం పొందిన జాబితా కాకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తమ సొంత జాబితాను సిద్ధం చేసి ప్రకటించారని పలువురు ఉద్యోగులు విమర్శిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆమోదించిన జాబితాలో స్పౌజ్ కేసులు చూపలేదని, మంగళవారం ఆ జాబితాను మార్పు చేసి పెట్టారని, దీంతో సీనియార్టీలో తమకు నష్టం జరుగుతుందని వాపోతున్నారు. ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకెళతామని ఉద్యోగులు ప్రకటించారు.

మరో ఇద్దరు వైసిపి కౌన్సిలర్లకు గాలం?

(మొదటి పేజీ తరువాయి)

కలిపి 8 మంది సభ్యులు మాత్రమే ఉండటంతో ఎన్నిక జరగకుండా టిడిపి అడ్డుకోగలిగింది. సమావేశం రోజున కోరం లేకపోవడంతో ఎన్నికల అధికారి మాధురి ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 19, 20 తేదీల్లో ఎన్నిక జరిగితే తిరిగి వైసిపికే ఛైర్మన్ పదవి దక్కుతుందని భావించిన టిడిపి... 11 మంది వైసిపి కౌన్సిలర్లను సమావేశం హాల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకుంది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం జూన్ 2వ తేదీన చెర్మన్ ఎన్నికకు మరొకసారి షెడ్యూలు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తమకు అవసరమైన ఇద్దరు వైసిపి కౌన్సిలర్లకు టిడిపి గాలం వేస్తోంది. ఈ గాలంలో తాజాగా 9వ వార్డు కౌన్సిలర్ మూడు దుర్గారావు చిక్కారు. మంగళవారం విజయవాడలో ఉమ్మడి కష్ణాజిల్లా మాజీ జడ్‌పి ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. దీంతో టిడిపి సంఖ్యాబలం ఎంఎల్ఎతో కలిపి 10కి పెరిగింది. ఇంకో వైసిపి కౌన్సిలర్ కోసం టిడిపి వేట కొనసాగిస్తూనే ఉంది. పార్టీకి కట్టుబడి ఉంటామని ఇటీవల 11 మంది వైసిపి కౌన్సిలర్లు తమ అధినేత జగన్‌ను కలిసి హామీ ఇచ్చారు. ఆ హామీకి భిన్నంగా దుర్గారావు టిడిపిలో చేరారు. మిగిలిన పది మందిని వెళ్లనీయకుండా ఆపేందుకు వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి నల్లగట్ల స్వామిదాసుకు, ఆ పార్టీ నేతలకు తలనొప్పిగా మారింది.

8 లక్షల టన్నుల ఇసుక నిల్వ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల అవసరాల కోసం 8 లక్షల టన్నుల ఇసుకను ఎంపిక చేసిన 6 స్టాక్ పాయింట్లలో నిల్వ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా చోడవరం, నార్త్ వల్లూరు, పడమటలంక, రొయ్యూరు, రొయ్యూరు సెమీ మేకనైజేడు, శ్రీకాకుళం స్టాక్ పాయింట్ల వద్ద ఇప్పటికే 6,15,987 టన్నులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈనెలాఖరుకు 8 లక్షల టన్నుల పూర్తిస్థాయి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. టన్ను ఇసుక రూ.155లుగా నిర్ధారించామన్నారు. సంయుక్త కలెక్టర్ నేతత్వంలో గనులు, పోలీసు, జలవనరుల శాఖ అధికారులతో ఏర్పాటు చేసే కమిటీ ఈనెల 31న అన్ని స్టాక్ యార్డులను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ఇసుక స్టాక్ యార్డులను పోలీసులు తరచూ తనిఖీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి సత్యనారాయణ, గనులు భూగర్భవనరుల శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, ఏజీ కొండారెడ్డి, భూగర్భ జల శాఖ ఏడి జయవర్ధన్, ఆర్డీవో శ్రీనివాస్ రావు, జలవనరుల శాఖ కేసీ డివిజన్ ఈఈ రవి కిరణ్, జీఎస్టీ సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు, డిఎస్పి సిహెచ్ రాజా పాల్గొన్నారు.

'మనమిత్ర' సేవలపై అవగాహన

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి మే 26 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 824 దరఖాస్తులు స్వీకరించగా, ఇప్పటికే 762 దరఖాస్తులు ఆమోదం పొందాయని పరిశ్రమల శాఖ అధికారులు వివరించారు. పారిశ్రామిక అభివృద్ధి విధానం (2015-20), (2020-23), (2023-27) కింద ఎంఎస్ఎంఈ రంగానికి అందించే ప్రోత్సాహ కాలపై నిర్వహించిన స్క్రుటినీ కమిటీ సమావేశాల్లో 90 క్లెయిమ్‌లకు వచ్చిన రూ.4.13 కోట్ల ప్రతిపాదనలకు డీఐఈపీసీ ఆమోదం తెలిపింది. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, ఇన్‌ఛార్జ్ జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకటరావు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను రీ సర్వే రద్దుకు కౌన్సిల్ తీర్మానించాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత కౌన్సిల్‌పై ఉంటుందన్నారు. తమకు అధికారం ఇస్తే ప్రతి ఏడాది 15 శాతం ఆస్తి పన్ను పెంపుదల నిబంధనను సమీక్షించి, రద్దు చేస్తామని 2024 సాధారణ ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చిన విషయాన్ని సత్యబాబు గుర్తుచేశారు. అలాగే కేంద్రంలోని బిజెపి-మోడీ ప్రభుత్వ వత్తిడి మేరకు గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన విలువ ఆధారిత పన్నును సమీక్షించి ప్రజలపై ఆస్తి పన్ను భారం తగ్గిస్తామని ఇచ్చిన హామీని నేడు తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదవుతున్నా ప్రజలకిచ్చిన హామీని నెరవేర్చకపోగా నగరంలోని భవనాలకు రీ-సర్వే చేసి ప్రస్తుత ఆస్తి పన్నును అదనంగా 20 శాతం పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాలు నగర ప్రజలను వంచించడమే అవుతుందన్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుంచి పట్టణ/నగర/స్థానిక సంస్థలకు తలసరి గ్రాంటు, అభివృద్ధి నిధులను రూ.1000 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అలాగే విఎంసికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో రూ.657 కోట్ల పెండింగ్ నిధులు నేటికీ విడుదల చేయలేదన్నారు. స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ స్కీమ్ నిధులు రూ.298 కోట్లు, ఎపి గ్రాంట్‌కు సంబంధించి రూ.132 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.196 కోట్లు, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.6 కోట్లు, వృత్తి పన్ను రూపంలో రూ.25 కోట్ల మేర పెండింగ్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయడంలేదన్నారు. నగరంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాలు ఆస్తి పన్నులను సక్రమంగా చెల్లించడం లేదన్నారు. దీంతో విఎంసి ఆదాయానికి భారీగా గండిపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు భవనాల కొలతలు రీ సర్వే నిర్వహించి ప్రస్తుత ఆస్తి పన్నుపై 20 శాతం పన్ను పెంపుదలను నిలుపుదల చేయాలని కోరుతూ కౌన్సిల్ తీర్మానించి ప్రభుత్వానికి పంపాలని కోరారు. అంతేగాక ఆస్తి పన్ను తగ్గింపుకు మేయర్ నేతృత్వంలో రాజకీయపార్టీల ప్రతినిధుల బృందాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు రాయబారం నిర్వహించాలని భాగ్యలక్ష్మికి సత్యబాబు విజ్ఞప్తి చేశారు. దీనిపై మేయర్ స్పందిస్తూ.... ఆస్తి పన్ను పెంపు రీ సర్వేపై జూన్ మొదటి వారంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించి, ఆ విధానాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుదామని హామీ ఇచ్చినట్లు సత్యబాబు తెలిపారు.

ఉపాధి హామీ పనులకు గ్రహణం

పంట బోదె పూడిక తీసుకుంటున్న రైతులు



ప్రజాశక్తి-ఉయ్యూరు: అన్నదాతలకు బాసట కల్పించి, పంటకాల్వల్లో పూడిక తీసి సాగునీరు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాల్సిన ఉపాధి హామీ చట్టానికి గ్రహణం పట్టింది. పంట పొలాల్లో బోదెలు తీసేందుకు ప్రతి ఏడాది ఉపాధి హామీ చట్టం ద్వారా విధిగా పనులు చేయించాల్సిన ఫీల్డ్ అసిస్టెంట్లు రాజకీయ కోణంతో విధులు నిర్వహిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని చినఓగిరాల గ్రామంలో కొత్త కాలువ నుండి సాగునీరు పొలాలకు అందించేందుకు పంట బోదె ఉంది. ఆ బోదే పూడిక తీసి సాగునీరు అందించేందుకు ప్రతి ఏడాది ఉపాధి హామీ చట్టం ద్వారా పనిని గుర్తించి విధిగా కూలీలతో పని చేయించి సాగునీరు సక్రమంగా సాగేలా ఉపాధి హామీ చట్టం గ్రామ మండల స్థాయి అధికార యంత్రాంగం సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది సీజన్లో పనిని గుర్తించినప్పటికీ ఐడి ఉన్నప్పటికీ గ్రామ పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న కొడాలి నవీన్ విధి నిర్వహణకు విరుద్ధంగా రాజకీయ కోణంతో పూడిక పనులు చేయించకుండా తాస్తారం చేస్తున్నారు. దీంతో పలువురు రైతులు ఇదేమని ప్రశ్నించగా అధికారులు ఇంకా వర్కు ఇవ్వలేదని తాను చేయించనని దురుసుగా సమాధానం చెప్పడంతో ఆ ప్రాంత రైతులు రోజువారి కూలీలతో కొంత సొమ్ము ఖర్చు చేసుకొని కాలువ పూడికతీత చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనిపై పలువురు రైతులు ఉపాధి హామీ చట్టం జిల్లా స్థాయి అధికారులకు మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేశామని మీడియాకు తెలిపారు. కేవలం ఫీల్డ్ అసిస్టెంట్ రాజకీయ దురుద్దేశంతోనే వైసీపీకి చెందిన రైతు పొలం గుండా పంట కాలవ పూడిక తీయించకుండా దురుసుగా వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అన్నదాతల మేలుకోరెందుకు ఉపాధి హామీ చట్టం ద్వారా చేస్తున్న అభివద్ధి పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా చంద్రగ్రహణం పట్టకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-పామర్రు: ఉండ్రపూడి- పోలవరం అడ్డరోడ్డు వద్ద వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ దేవస్థానం హుండీ లెక్కింపు ఈనెల 29న నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ అధికారి పివిఎన్వి.ప్రసాద్ రావు మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు దేవాదాయ ధర్మా శాఖ అధికారులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరుగుతుందన్నారు. మంగళవారం దేవాలయానికి వచ్చిన యాత్రికులకు దాత గంధం వెంకట రమేష్ 120 లీటర్ల మజ్జిగను ఉచితంగా పంపిణీ చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

పైపులైన్ కోసం వినతి

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి మండలం వెంకటాపురం పంచాయతీ శివారు కొత్త కాలనీ ప్రజలు మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారని జనసేన నాయకులు కోసూరు రామాంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కాలనీ ప్రజలందరికీ రక్షిత మంచినీటి సరఫరా పథకం కింద పైపులైన్లు వేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శి రాంబాబుకు వినతిపత్రం అందించారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై విచారణ

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం ముస్తాబాద్, పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాల పరిధిలో ఉన్న కొండల్లో అక్రమ క్వారీ తవ్వకాలపై మైనింగ్ అధికారులు లోతైన విచారణ చేపట్టినట్లు తెలిసింది. మొత్తంగా ఒక రిపోర్టు తయారుచేసి ప్రభుత్వానికి ఇచ్చారని సమాచారం. ఇందులో వైసీపీ నాయకుల పాత్ర ఉందా? మాజీ ఎమ్మెల్యే వంశీ పాత్ర ఉందా, వంశీ అనుచరుల పాత్ర ఉందా అన్న విషయాలను పూర్తిగా విచారణ చేశారట. వైసిపి హయాంలో అక్రమ సంపాదనకు అలవాటు వడిన కొంతమంది వ్యక్తులకు క్వారీ రబ్బీసు కాసుల వర్షం కురిపించింది. ప్రభుత్వ అధికారుల అండదండలతో ఈ అక్రమ మట్టి తవ్వకాలు యధేచ్ఛగా జరిగిపోయా యి. ముస్తాబాద చెరువుకు వెళ్లే రోడ్డుకు మలుపులో నెలల పాటు ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ అక్రమ తవ్వకాలు నిరాటంకంగా జరిగిపోయినట్లు విమర్శలు వచ్చాయి. రాత్రి వేళల్లో ప్రోక్లైన్ పెట్టి గ్రావెల్ తవ్వేశారు. ఈ తవ్వ కాలకు అనుమతులు లేవు అని మైనింగ్ అధికారులు చెబుతున్నా గాని రబ్బీస్ యదేచ్ఛగా తరలిపోతుంటే చర్యలు తీసుకునే నాధుడే లేరు. అదేమని సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే మళ్ళీ దొంగలను సమర్థిస్తూ వారిని వెనకేసుకురావడం జరిగిందని అప్పట్లో స్థానికులు చెప్పారు. అనుమతులు కొరకు దరఖాస్తు చేసుకున్నారని అందుకే రబ్బీస్ తరలిస్తున్నారని చెప్పడం ఆశ్చర్యాన్ని గురి చేస్తోందని చుట్టుపక్కల ఉన్న రైతులు అన్నారు. శాఖాపరమైన అనుమతులు మంజూరు కాకుండానే దరఖాస్తు చేసుకోగానే కొండపై యంత్రాలు పెట్టి గ్రావెల్ ను తరలించుకోవచ్చని చెప్పడం విడ్డూరంగా ఉంది. కోట్లాది విలువైన ఎర్ర బంగారం ఇప్పటికే ఆక్రమార్కుల పాలైంది. సంబంధిత శాఖ అధికారి కూడా పర్యవేక్షణ లేకుండా పోయింది. అక్రమార్కులకు మట్టిని అమ్ముకొని జేబులు నింపుకుంటున్నారని వాదన ఉంది. గ్రావెల్ దొంగలకు గత ప్రభుత్వమే దారులు తెరిచినట్లుగా ఈ వ్యవహారం ఉందని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల ప్రాంతంలో నెలల పాటు ఈ క్వారీ తవ్వకాలు జరిగాయని, జగన్ ఇళ్ళ పేరుతో దర్జాగా ప్రైవేటు స్థలాలకు రబ్బీసును తరలించకపోయి దండీగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేస్తున్నారని స్థానికులు ఆరోపిం చారు.తవ్వకం దారులు గ్రామాల పరిధిలోని రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసుకుంటున్నారని అప్పట్లో విమర్శ వచ్చింది. నెలవారీగా వారికి మామూలు ఇచ్చి దర్జాగా కొండలు కొట్టేశారు. అయితే వంశీ అరెస్టు నేపథ్యంలో మైనింగ్ మాఫియాలో కూడా అతని పాత్ర ఉందా అన్నదానిపై పండింగ్ అధికారులు లోతైన పరిశీలన చేశారని అంటున్నారు. విచిత్ర ఏమంటే ఈ క్వారీల తవ్వకాలకు అనుమతుల విషయంలో ఎక్కడ వంశీ పేరు లేదు. ఈ నేపథ్యంలో మైనింగ్ అధికారులు ఏ విధమైన చర్యలు ఎవరిపైన తీసుకుంటారో, అక్రమ తవ్వకాల్లో ఎవరిని కేసులో పెడతారో వేచి చూడాలని పరిశీలకులు అంటున్నారు.




గ్రావెల్ తరలించిన దృశం (ఫైల్)

సైబర్ నేరాలపై అవగాహన



గుడివాడలో...

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: సైబర్ నేరాలను ఎదుర్కొనే విధంగా ఉండాలని డిసిపిఓ జె.స్వరాజ్యం అన్నారు. కిశోర వికాస్ వేసవి శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని అంగుళూరు గ్రామంలో మంగళవారం నిర్వహించారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ భద్రత, వివిధ సమస్యలను ఏ విధంగా ఎదుర్కోవాలో కిషోర్ బాలికలకు వివరించారు. ఆన్లైన్లో వల్ల, సెల్ఫోన్ల వలన జరిగే నష్టాల గురించి, సైబర్ నారా గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఈవూరి వాణి తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు:** పెనమలూరు మండల పరిధిలోని వణుకూరు, గోశాల, గంగూరు గ్రామాలలో గల అంగన్వాడి కేంద్రాలలో కిషోరి వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపు లో భాగంగా వణుకూరు అంగన్వాడీ కేంద్రం-4లో మంగళవారం సైబర్ నేరాలు ఆన్లైన్ భద్రత మరియు వివిధ సమస్యలను ఎదుర్కోవడం ఎలా అనే అంశంపై మహిళా కార్యదర్శి డి వికల్ప అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శులు ఎం సుధారాణి,ఎన్ తబిత, జి విజయలక్ష్మి, ఎం జ్యోతి, టీ లిఖిత పాల్గొన్నారు. **ఉయ్యూరు:** సైబర్ నేరాలు ఆన్లైన్ భద్రతపై కిశోర బాలికలు అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ కంకిపాడు సూపర్వైజర్ బేబీ సరోజినీ సూచించారు. కిషోరీ వికాసం శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ 8వ సెషన్ కార్యక్రమం జరిగింది. స్థానిక ఉయ్యాల స్తంభాల సెంటర్ అంగన్వాడి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ పాల్గొని మాట్లాడారు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వీటిపై అవగాహన లేకపోవడంతో ఎందరో యువతీ యువకులు ఆన్లైన్ బారినపడి అనేక నేరాల్లో ఇబ్బందులు పడుతూ సమస్యల వలయాల్లో చిక్కుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కోరాడ వెంకటలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఝాన్సీ, అంగన్వాడీ కార్యకర్తలు లీలాసత్యవతి, రమణ తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ:** స్థానిక 12వ వార్డులో కిశోర వికాసం వేసవి శిక్షణ తరగతులలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఓ విజయ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ ఇంటర్నెట్, వివిధ ఆన్లైన్ ప్లాట్ఫారం ద్వారా జరిగే మోసాలు, హ్యాకింగ్, వ్యక్తిగత సమాచారం దొంగతనాలు జరగకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్లైన్లో మోసపూరితమైన ప్రకటనలు, లావాదేవీలు ద్వారా డబ్బును దొంగలించడం, ఆన్లైన్లో ఒకరిని వేధించడం, బెదిరించడం ఇలాంటివి జరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు బికేడి భవాని, నాగజ్యోతి పాల్గొన్నారు. **పమిడిముక్కల:** బాల్య వివాహాలు చేయడం నేరమని, కౌమార బాలికలకు పరిశుభ్రత కార్యక్రమాల గురించి తెలియజేయాలని అంగన్వాడి సూపర్వైజర్ ఉష అన్నారు. మంగళవారం మండలంలోని అంగన్వాడి మూడో సెంటర్లో కౌమార బాలికల ర్యాలీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాగ భార్గవి, విజయనిర్మల పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో...



ఉపాధి కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిలాల్లో ఉపాధి కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా నీటి యజామాన్య ప్రాజెక్టు అధికారి శివప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి పవన్ మాట్లాడుతూ ఉపాధి శ్రామికుల ఏడు వారాలు వేతనాలు ప్రభుత్వం ఇవ్వకుండా జాప్యం చేసిందన్నారు.అలాగే శ్రామికులకు పనుల కల్పించడంలో ప్రభుత్వం పరిమితులు పెట్టి పనులు లేకుండా చేస్తూ ఒకపక్క చేసిన పనులకు వేతనాలు ఇవ్వని పరిస్థితుల్లో కార్మికులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నరన్నారు. వ్యవసాయ కార్మిక సంఘంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి శ్రామికులకు 200 రోజులు పని దినాలు కల్పించాలని పని ప్రదేశాల్లో వాళ్ళ భద్రత కోసం సౌకర్యాలు కల్పించాలని ఇప్పటివరకు ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసి కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అజ్మీర్ వెంకటేశ్వరరావు, సిహెచ్.జయరావు, బూర సుబ్రహ్మణ్యం ఉన్నారు.

హైవేపై ప్రమాదాలు జరగకుండా చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-పామర్రు: పామర్రు మండల పరిధిలోని మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోనున్నట్లు గుడివాడ డిఎస్పి వి.ధీరజ్ వినీల్ తెలిపారు. మంగళవారం జాతీయ రహదారి పై నిడుమోలు నుండి గోపాలపురం వరకు ప్రమాదములు ఎక్కువగా జరుగుచున్న (బ్లాక్ స్పాట్స్)ను తన సిబ్బందితో కలిసి గుర్తించారు. నిడుమోలు, జుజ్జువరం, కొండిపర్రు క్రాస్ రోడ్డు, బల్లిపర్రు, కురుమద్దాలి పెట్రోల్ బంక్, కనుమూరు, గోపువానిపురంలలో తనిఖీ చేసి అక్కడ తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పోలీస్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. నేషనల్ హైవే కి చెందిన ఇంజనీర్లతో మాట్లాడి ఆయా ప్రదేశంలలో బ్లింక్ లైట్లు, ప్రమాద హెచ్చరిక సూచనల బోర్డులు మరియు బ్లాక్ స్పాట్ కి సుమారు 500 మీటర్ల నుండి ప్రమాద జరిగే ప్రదేశం ఉన్నది అని తెలిపే బోర్డులు ఏర్పాటు చేయవలసిందిగా ఆయా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పామర్రు సిఐ.వి. సుధాకర్, కూచిపూడి ఎస్సై.విశ్వనాథ్, పామర్రు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, పమిడిముక్కల ఎస్సై.శ్రీనివాస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.





మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కోడూరు: లయన్స్ క్లబ్ కోడూరు వారి ఆధ్వర్యంలో కోడూరులోని శ్రీ దాన శక్తి ఆర్యవైశ్య ప్రార్ధన మందిరం వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పూతబోయిన సీతారత్న సాయిబాబు మాట్లాడుతూ 11వ మెగా రక్తదాన శిబిరం నిర్వహించి ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడం సంతోషకరంగా ఉందని ఈ శిబిరంలో 51 మంది రక్త మందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు.

మురుగు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన



డ్రెయినేజీలో మురుగు తొలగిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : 'దోమలు బాబోయ్ దోమలు' అనే వార్తకు రెడ్డిగూడెం గ్రామ పంచాయతీ సెక్రటరీ స్పందిం చారు. మంగళ వారం రెడ్డిగూడెం గ్రామ పంచాయతీలో డ్రైనేజీలో పేరుకు పోయిన మురుగు తొలిగింపు పనులు చేపట్టారు. పారిశుధ్య కార్మికులు డ్రెయినే జీల్లో పూడుకుపోయిన చెత్తను తొలగించి నిల్వ నీటిని పారుదలయ్యేలా చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి రామారావు మాట్లాడుతూ డ్రైనేజీలో పూడికను తొలగించి నీటిని నిల్వ లేకుండా చేస్తున్నామని, ఇది పూర్తి కాగానే దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ గృహాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.



ఉపాధి నైపుణ్యాభివృద్ధికి శిక్షణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, నందిగామలో నైపుణ్య కేంద్రం (స్కిల్ హబ్)కు ఇన్ఫోసిస్ కంపెనీ నుండి శిక్షణ ఇచ్చే నిమిత్తం కంపెనీ ట్రైనింగ్ బస్సు మంగళవారం వచ్చింది. 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు మైక్రో కంట్రోలర్ బేస్డ్ ప్రాజెక్ట్స్, ఎనర్జీ కన్వర్జేషన్ అంశాల్లో ఈ బస్సులో స్థానిక విద్యార్థినులకు ఉద్యోగ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ద్వారా 50మందికి పైగా విద్యార్థినులకు ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు మెరుగు పడేలా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాధికారి ఎస్.శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్ బాబు, ట్రైనర్ భాను, నందిగామ స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చరణ్ పాల్గొన్నారు. స్కిల్ హబ్ కేంద్రంలో కంప్యూటర్ కోర్సు, టైలరింగ్ కోర్సులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నటు కో ఆర్డినేటర్ చరణ్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు 8919951682 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించొచ్చని తెలిపారు.

కడప మహానాడుకు ఎంఎల్‌ఎ గద్దె రూ.3 లక్షలు విరాళం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మహానాడు నిర్వహణకు ఎమ్మెల్యే గద్దె రూ.2 లక్షలు, కృష్ణాజిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. టిడిపి పండుగ అయిన మహానాడుకు తూర్పు నియోజకవర్గం నుంచి పసుపు సైన్యం కదిలి వెళ్ళింది. తూర్పు నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీల్లోని నాయకులు పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు కడపలో జరుగుతున్న మహానాడుకు బయలుదేరి వెళ్ళారు. తూర్పు నియోజకవర్గం నుంచి మహానాడుకు వెళ్ళిన పార్టీ శ్రేణులకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మంగళవారం ఉదయం మహానాడు ప్రాంగణంలో స్వాగతం పలికారు. మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో నాయకులు, కార్యకర్తల వివరాలను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ దగ్గర ఉండి నమోదు చేయించారు. మహానాడు ప్రాంగణంలో వీరికి కేటాయించిన ప్రదేశంలో వారు ఉండేలా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ దగ్గర ఉండి చూశారు.

ఆక్రమణకు గురైన రోడ్ల పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కబేళా రోడ్లో ఆక్రమణకు గురైన మున్సిపల్ రోడ్డును స్థానిక బాధితులతో సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మంగళవారం పరిశీలించారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు కమిషనర్ వెంటనే స్పందించి కార్పొరేషన్ స్థలాల్ని కబ్జా చేసిన వాటిని స్వాధీనపరచుకొని ప్రజల సౌకర్యార్థం రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, రోడ్డు నిర్మాణ పనులు అడ్డుకుంటున్న టిడిపి కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఇసుక భూములు, ఈ ప్రభుత్వంలో ఉన్న వారు కూడా అదే బాటలో కొండలు మున్సిపల్ రోడ్లు సైతం కబ్జాలు చేస్తున్నారని, ఈ అక్రమ దందాను మున్సిపల్ పోలీస్ యాంటీ గుండా స్క్వాడ్ అరికట్టాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలు ఆందోళన బాట పడతారని తెలిపారు.



రోడ్లు పరిశీలించిన అనంతరం స్థానికులతో మాట్లాడుతున్న సత్యబాబు

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇవి నారాయణ, నగర కమిటీ సభ్యులు జి.వెంకట్రావు ఎండి మస్తాన్, డివిజన్ నాయకులు ఎ.అప్పలరాజు పాల్గొన్నారు.

'మ్యాట్ ల్యాబ్'తో విస్తృత ప్రయోజనాలు



ప్రజాశక్తి - వన్‌టౌన్ : అధునాతన సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్ తయారీతో సహా ఆటోమేషన్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఏరోనాటిక్స్ రంగాలతో అనేక అప్లికేషన్ల అభివృద్ధిలో 'మ్యాట్ ల్యాబ్' కీలకపాత్ర పోషిస్తుందని ప్రముఖ గణిత విద్యావేత్త, అమృత విశ్వమహావిద్యాలయం గణిత విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. కె.బి.ఎన్. కళాశాల గణితం, సాంఖ్యక శాస్త్ర విభాగం, రీసెర్చ్ సెల్ సంయుక్త నిర్వహణలో మంగళవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ మ్యాట్‌ల్యాబ్ అత్యంత ఆధునికమైన ప్రోగ్రామింగ్ భాష అని, న్యూమరికల్ కంప్యూటింగ్ కోసం దీన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. గణిత నమూనాలు రూపొందించడం, డేటా విశ్లేషణ, ఇంటర్‌ప్రెటేషన్, పరిశోధనలకు అవసరమైన సిమ్యులేషన్, టెస్టింగ్ రంగాలు 'మ్యాట్ ల్యాబ్' ఉపయోగించడం ద్వారా అత్యంత అభివృద్ధి చెందాయన్నారు. విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యాలు పెంచి, గణితం పట్ల ఆసక్తి పెంచటానికి మ్యాట్ ల్యాబ్ ఉపయోగిస్తుందన్నారు. గణిత గణనలను వేగంగా, కచ్చితంగా నిర్వహించటం మ్యాట్ ల్యాబ్ ద్వారా సాధ్యమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ గణితశాస్త్ర అనువర్తనం లేని రంగం ఏదీ ఉండదని, గణిత పరిశోధనల ద్వారా ఉపాధ్యాయులు మరింత ఉన్నతంగా బోధించడం సాధ్యమవుతుందన్నారు. హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో బాబు జగ్జీవన్‌రావు భవనంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, విజయవాహిని ఛారిటబల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఎసిడిపిఒ కృష్ణ కుమారి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ ఋతుక్రమం దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి, నందిగామ మున్సిపాల్ కమిషనర్ రమణ బాబు పాల్గొన్నారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ కిశోర బాలికలకు, మహిళలందరూ ఋతుక్రమం సమయంలో ప్రోటీన్ కలిగిన ఆహారం తీసుకోవాలని, ఆకుకూరలు, పండ్లు, వ్యాయామం చేయాలని, యోగా చేయాలని చెప్పారు. కమిషనర్ రమణ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. డాక్టర్ వాసంతి మాట్లాడుతూ ఋతుక్రమం సమయంలో శానిటరీ ప్యాడ్స్ ప్రతి నాలుగు గంటలకు ఒకసారి మార్చాలని తెలిపారు. నందిగామ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి మహిళ ఋతుక్రమం ప్రతి నెల సరిగా వచ్చేలా తగు జాగ్రత్తలు పాటించాలని



మాట్లాడుతున్న ఎసిడిపిఒ కృష్ణ కుమారి

పేర్కొన్నారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భార్గవి మాట్లాడుతూ ఋతుక్రమం సమయంలో ప్యాడ్స్ ఎలా వాడాలి ఏ ఆహారం తీసుకోవాలో డెమో చేసి చూపించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు కిశోర వికాసం ప్రోగ్రామ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కామేశ్వరి సిడిపిఒలు లక్ష్మి భార్గవి, పుష్పలత, సత్యవతి, జోత్స్న, కవిత, కిన్నెర, భాగ్యలక్ష్మి, కిరణ్ కుమార్, డీసీపీయు, సిబ్బంది, సూపెర్వైసర్లు, ఎఎన్ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు హాజరయ్యారు.

వ్యవసాయ పనులు ముమ్మరం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ డివిజన్లో కాలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు పొలాలు దుక్కి దున్ని సాగు చేస్తున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం రాగానే పొలాన్ని దున్ని విత్తనాలు వేయటం రైతులు చేస్తున్నారు. ఎత్తుమడులు వేసి బోదెలు తోలి వాటిపై పత్తి, మిర్చి తదితర విత్తనాలు విత్తనం వల్ల ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. పంటల సాగు చేస్తున్న నల్లరేగడి, ఎర్రనేల, బంక మట్టి తదితరాలు నేలపై ఎత్తు మడులు ఉపయోగకరం అని నందిగామ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు పేర్కొన్నారు. వర్షాలు తక్కువైనా, ఎక్కువైనా వర్షానికీ, వర్షానికి మధ్య ఎక్కువ రోజులు పట్టినా రైతులను ఎత్తుమడులు ఆదుకుంటాయని తెలిపారు. ఎత్తుమడుల వల్ల మురుగునీటి వ్యవస్థ మెరుగుపడుతుంది. వర్షపు నీరు పొలంలో నిలవకుండా కాలువల ద్వారా బయటికి వెళ్లిపోతుంది. దీని వల్ల తొలి దశలో మొక్క పెరుగుదలకు ఆటంకం ఉండదు. సాధారణ పద్ధతితో పోలిస్తే ఎత్తుమడులు పద్ధతిలో 10 నుండి 20 శాతం వరకు వచ్చే అవకాశం ఉంది. ఎత్తు



పంట పోలం దుక్కి దున్నుతున్న రైతు

మడులపై పత్తి సాగు లాభాలు తెచ్చిపెడుతుందని నందిగామ వ్యవసాయ అధికారి ఖాశీం తెలిపారు. ఎత్తు మడుల మీద విత్తనం సాధారణ పొలంలో కన్నా ఒకటి రెండు రోజులు ముందే మొలకెత్తుతుందని తెలిపారు. సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే మొలక శాతం ఎక్కువగా ఉంటుంది. దాదాపు 90 శాతం వరకు వస్తుంది. మందులు పిచికారీ, పత్తి ఏరటం, పంట కోత, పంట అవశేషాలు ఏరివేత సులభతరం. పత్తిలో అంతర పంటగా కంది విత్తుకుంటే ఒక పంట దెబ్బతిన్న మరో పంట రైతును ఆదుకుంటుంది.



పలు కార్యాలయాల్లో యోగా శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : అంతర్జాతీయ యోగాడే సందర్భంగా మే 21 నుండి జూన్ 21 వరకు ప్రతిరోజు యోగా కార్యక్రమం చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చిల్లకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యోగా మాస్టర్ ట్రైనర్ కె.అశ్విని ఆధ్వర్యంలో యోగా క్లాసులు నిర్వహించారు. యోగా మాస్టర్ ట్రైనర్ కె.అశ్విని వివిధ రకాల ఆసనాలు యోగా నేర్పిస్తూ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం పరిపాలనాధికారి వై.ఎస్.మాధవ శర్మ, సీనియర్ అసిస్టెంట్ డి.కిశోర్ కుమార్, టైపిస్ట్ జి.లక్ష్మీ తిరుపతమ్మ, చిల్లకల్లు-1,2,3 సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులు

ముగిసిన ఇఎపి సెట్ పరీక్షలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహినీ ఇంజనీరింగ్ కళాశాలలో జెఎన్‌టియు కాకినాడ ఆధ్వర్యంలో మే 19 నుండి 27 వరకు నిర్వహించిన ఇఎపిసెట్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మొత్తం 2,100 మంది విద్యార్థులకు గానూ 1,799 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పరీక్షలు చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు తెలిపారు.

మామిడి మొక్కలు నాటిన ఆలయాధికారులు

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ మున్నేరు అవతల పాపమాంబ వనంలో హెచ్ఈఎస్ఎన్ కిషోర్ కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు మామిడి మొక్కలు నాటారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యాత్రికులు తోటలో చెట్ల కింద సేద తీరేందుకు ఖాళీగా ఉన్న స్థలంలో 50 మామిడి మొక్కలు నాటించామన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్ శ్రీనివాసరావు ఏఈ రాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

31న బీచ్‌లో యోగాంధ్రకు ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఈ నెల 31వ తేదీన మంగినపూడి బీచ్‌లో జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి పక్కా ప్రణాళికతో కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని ఆయన చాంబర్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి మంగినపూడి బీచ్, మచిలీపట్నం నగరంలో యోగాంధ్ర కార్యక్రమాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 31న ఉదయం 7 నుండి 8 గంటల వరకు మంగినపూడి బీచ్‌లో పెద్దఎత్తున యోగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చాలా కట్టుదిట్టంగా చేయాల్సి ఉందన్నారు. వెయ్యి మంది


మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పాల్గొనేందుకు వీలుగా పక్కా ప్రణాళికతో లేఅవుట్ సిద్ధం చేయాలన్నారు. బీచ్‌లో ఎలాంటి చెత్తాచెదారం లేకుండా పారిశుధ్య ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. జూన్ 2వ తేదీన ఐదు వేల మంది వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులతో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు లక్ష్మీ టాకీస్ నుండి సాయిబాబా గుడి వరకు ఒకవైపు రహదారిపైనే నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దారి మళ్లించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, యోగాంధ్ర సమన్వయ అధికారి పోతురాజు, డ్వామా, డిఆర్‌డిఏ, ఐసిడిఎస్ పీడీలు శివప్రసాద్, హరిహర నాథ్, ఎంఎన్ వాణి, డీఎస్ఓ పార్వతి, డిపిఓ అరుణ, ఆర్డీవో కే స్వాతి, ఆర్టీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ జావేద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.




పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-కంకిపాడు: గ్రీన్ సిటీ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో తాడిగడప గ్రీన్ సిటీ ప్రహరీ గోడ బయట మెయిన్ రోడ్డు మార్జిన్లో మంగళవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాడిగడప మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్ మొక్కలు నాటి అనంతరం మాట్లాడారు. పచ్చదనం, పరిశుభ్రత, గ్రీనరీ కోసం గ్రీన్ సిటీ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ సిటీ డెవలప్మెంట్ కమిటీ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసు, అధ్యక్షులు శేషగిరిరావు, ఉపాధ్యక్షులు నాగరాజు, సహాయ కార్యదర్శి మాధవరావు, కోశాధికారి కృష్ణ పరమాత్మ, సభ్యులు ఆనందరావు, సురేష్, గ్రీన్ సిటీ నివాసితులు నాంచారయ్య, కృష్ణ ప్రసాదు, కిషోర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.


వంద మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ గ్రామ కార్యదర్శి బి అనిత ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రేపల్లె శ్రీ సాయి కంటి హాస్పటల్ నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం సర్పంచ్ విజయకుమార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఏ కిషోర్ కుమార్ పాల్గొని వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ళజోడు అవసరమైన వారికి తక్కువ ధరకు కళ్ళజోళ్ళు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్లు ఎస్ రాజేష్, కే కార్తీక్, ఎస్ నాగలక్ష్మి, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులిగడ్డ పుచేశ్వరరావు పాల్గొన్నారు.



వైద్య సిబ్బంది స్థానికంగా ఉండాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది స్థానికంగా నివాసం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సేకుపోయిన సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. మంగళవారం సర్వజన ఆస్పత్రి సూపరిండెండెంట్ ఆశాలతను కలిసి వినతిపత్రం సమర్పించారు. తద్వారా రోగులకు సకాలంలో అలాగే ఆపద సమయాలు అత్యవసర వేళల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలవుతుందన్నారు. ఇక్కడ పనిచేసే ప్రొఫెసర్లు, వైద్యులు, స్టాఫ్ నర్స్ లు స్థానికంగా నివాసం ఉండకపోవడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందట్లేదని అభిప్రాయపడ్డారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో కాకుండా,వేరే ఊర్లు, జిల్లాల్లో నివాసం ఉండడం చేత అత్యవసర సమయాల్లో రోగులకు అందుబాటులో లేకుండా, ఎక్కువ శాతం కేసులు విజయవాడకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. కాబట్టి వైద్య సేవలు అందించవలసిన సంబంధిత సిబ్బంది మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోనే నివాసం ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించవలసిందిగా కోరుతూ డిప్యూటీ సూపరిండెండెంట్ శ్రీనివాస్, ఆర్.ఎం.ఓ నిరంజన్ లకు వినతి పత్రం కాపీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీ.సీ నాయకులు ఎం. అన్సారి, చేబోయిన కోటేశ్వరరావు, బోయిన రమేష్, పెద్ది బోయిన సాంబ, ఎం.పవన్, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.





మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ: స్థానిక భాస్కర్ థియేటర్ వెనక రోడ్డులోని చిన్నం గంగాధరరావు ఇంటి వద్ద మంగళవారం క్లబ్ అధ్యక్షులు మెరుగుమాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బచ్చు రాధాకృష్ణ, తమ్మినేని రామ్మోహన్రావు, చింతలూరి సత్యనారాయణ, దిమ్మిటి శరమేష్, పొట్టి సతీష్‌బాబు, కొలుసు సతీష్‌కుమార్, సిహెచ్ సుబ్రమణ్యం, పి.సూరిబాబు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి-గుడివాడ: సిఎం రిలీఫ్ ఫండ్ పేద కుటుంబాలను ఆదుకుంటుందని టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయ ప్రజావేదికలో గుడివాడ పట్టణం 11వ వార్డుకు చెందిన పేద ముస్లిం కుటుంబానికి రూ.90వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను పట్టణాధ్యక్షుడు దింట్యాల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే నాయకుడు ఉంటే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ప్రజల మంచి కోసమే కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చేకూరు జగన్‌మోహన్‌రావు, సయ్యద్ గఫార్, సయ్యద్ జబిన్, బాధిత కుటుంబ సభ్యురాలు షేక్ అబ్బాస్‌బికు తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో గుర్రపుడెక్క తొలగించాలి : హరిబాబు

ప్రజాశక్తి-ఉయ్యూరు: నీటిపారుదల శాఖ అలసత్వంతో పుల్లేరు కాలువ నిండా గుర్రపు డెక్క విస్తరించి నీటి ప్రవాహాన్ని అడ్డుకునే పరిస్థితి ఏర్పడిందని, ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న సమయంలో గుర్రపు డెక్కను వెంటనేత తొలగించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొల్లేరు కాల్వలను ఆయన పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాలుగా పుల్లేరు కాలువ పూడికతీత చేపట్టలేదని, దానికి పర్యవసానంగా అనేక రకాలైన కాలుష్యాన్ని కాలువలోకి వదులుతున్నారని, దీనిపై చర్యలు శూన్యమని అన్నారు. పుల్లేరు కాల్వలో గుర్రపుడెక్క నిర్మూలన పనులు అసంపూర్తిగా చేయడంతో తిరిగి యధా స్థితికి చేరుకుంటూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందాన తయారైందన్నారు. దిగువ ప్రాంతాల్లో వేలాది ఎకరాలు, వందాలది గ్రామాలకు సాగు, తాగునీరందించే పుల్లేరు కాల్వ ఉయ్యూరు మండల పరిధిలో గుర్రపుడెక్కతో నిండి పంట సాగు చేసే సమయంలో నీటి ప్రవాహానికి అడ్డుగా నిలుస్తుందన్నారు. కాల్వలో డెక్క నిర్మూలించేందుకు ఇటీవల కాల్వకు రెండువైపులా కట్టల


పుల్లేరుకాల్వలో గుర్రపు డెక్కను చూపుతున్న హరిబాబు

వెంబడి మందు చల్లించి ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దీంతో కాల్వ పొడవునా ఇరువైపులా కట్టల వెంబడి డెక్క ఎండిపోగా మధ్యలో పచ్చగా నిగనిగలాడుతూ పెరిగి కాల్వంతా అలుముకుంటుందని చెప్పారు. ప్రసుతం కాల్వలో నీరు ఎండిపోతున్న పరిస్థితుల్లో డెక్క అంతా నిర్మూలించేందుకు డ్రోన్‌లతో మందు చల్లించాలని, లేకుంటే తిరిగి వ్యవసాయ పనులు ప్రారంభించే నాటికి యధాస్థితికి చేరుకుంటుందని అన్నారు.

కార్మికులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: కామాక్షి మచిలీపట్నం స్వర్ణకార సంఘ ఆధ్వర్యంలో మంగళవారం అమావాస్య సెలవు దినాన్ని పురస్కరించుకొని



మచిలీపట్నం కోనేరు సెంటర్లో ఉదయం అల్పాహారాన్ని అందించారు. స్వర్ణకార సంఘం నాయకులు మానేపల్లి దుర్గారావు, నండూరి చంద్రమౌళి తదితరుల నేతత్వంలో 500 మందికి అల్పాహారం పంపిణీ చేశారు. మచిలీపట్నం జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు స్వర్ణకార సంఘం నాయకులు గడ్డం రాజు ఈ కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార నాయకులు వాసా బత్తుల శ్రీనివాస్, శేషుబాబు, పి శ్రీను, దేవు కనక రత్నాచారి, గంగాధర్, రఘు, సాయి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గజేంద్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ

స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన రూరల్ మండల అధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పట్టణ ఉపాధ్యక్షులు వేమూరి త్రినాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి తరగతులు

ప్రజాశక్తి-గుడివాడ: స్థానిక రాజేంద్రనగర్‌లోని గ్రంథాలయ విద్యార్థులకు వివిధ పోటీలపై శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి పేపేటి శాంతి, సమ్మర్ క్యాంపులో భాగంగా అవిర్నేని వెంకటేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వరరావులు, హరిశ్చంద్ర మహారాజు యొక్క గొప్పతనం వివరించారు. **గన్నవరం:** విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి చిత్రలేఖనం పోటీలు దోహదపడతాయని గ్రంథాలయ అభివృద్ధి

గన్నవరంలో...


కమిటీ మెంబర్ చిమట రామారావు అన్నారు. గన్నవరం గ్రేడ్ వన్ గ్రంథాలయంలో పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి పిల్లలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ కార్యక్రమం తర్వాత గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారావు, గ్రంథాలయ అధికారి లక్ష్మీ పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పంచతంత్ర కథలు పుస్తకాలలో నుండి మంచి మిత్రుల కథను చదివి వినిపించారు. క్రాఫ్ట్ వర్క్‌లో భాగంగా పేపర్స్ తో కలువ పువ్వులు, పెన్ స్టాండ్లు మొదలైనవి తయారు చేశారు. అనంతరం పజిల్స్, క్యారమ్స్, క్రికెట్ పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిని టి.వాణి తెలిపారు. **కంకిపాడు:** కంకిపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు చదివి వినిపించి పుస్తక పఠనం చేయించారు. అలాగే



పామర్రులో...

ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు రామకృష్ణ పాల్గొన్నారు. **పామర్రు:** మండల పరిధి జమీగొల్వేపల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా మంగళవారం పుస్తకప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ పుస్తక ప్రదర్శనలో విద్యార్థులకు, పాఠకులకు గ్రంథ పరిచయం జరిగే విధంగా చిల్డ్రన్స్ నాలెడ్జ్ బుక్స్, బాల సాహిత్యం, విజ్ఞాన సర్వస్వాలు, వేమన - సుమతి శతకాలు, జనరల్ నాలెడ్జ్, పోటీ పరీక్షలు, చరిత్ర, సంస్కృతికి సంబంధించిన గ్రంథాలు ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి. నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట గ్రంథాలయంలో ఇంగ్లీష్ గ్రామర్ నేర్పుతున్న వినోద్ బాబు



మైలవరం గ్రంథాలయంలో శిక్షణ ఇస్తున్న సాంబశివరావు



కంచికచర్ల గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళు లర్పిస్తున్న చిన్నారులు

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న శిక్షణ

ప్రజాశక్తి - మైలవరం : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని ఎల్‌బిఆర్‌సిఇ కళాశాల గ్రంథ పాలకులు డాక్టర్ టి.సాంబశివరావు అన్నారు. మైలవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు గ్రంథాలయాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదవటం వల్ల కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులచే నీతి కథలు పుస్తకాలు చదివించి కథలు చెప్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

కంచికచర్ల : కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. మంగళవారం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ61వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కంచికచర్ల హైస్కూల్ తెలుగు మాస్టర్ ఎస్‌కె ఇస్మాయిల్ నెహ్రూ విద్యార్థులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసినివాళులర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి నెహ్రూకి చిన్న పిల్లలంటే ఇష్టమని అలాగే గులాబీ పూలన్న ఇష్టమని, బాల్య వివాహాలను ఖండించారని తెలిపారు. డ్రాయింగ్ మాస్టారు నీలం సర్వేశ్వరరావు కూరగాయలు చిత్రాలను గీసి విద్యార్థులకు మెళకువలు వివరించారు. క్రాఫ్ట్ మోటర్ కనకారావు విద్యార్థులచే క్రాఫ్ట్ వర్క్ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: పట్టణంలోని గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మంగళవారం మొదటిగా పుస్తక పఠనం చేయించారు. చదివిన కథలను చెప్పించారు. అనంతరం విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయులు వినోద్ బాబు ఇంగ్లీష్ గ్రామర్ లో నేర్పించారు. తదుపరి విద్యార్థులు సరదాగా పాటలు పాడి ఎంజాయ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల అధికారిని ఆలేటి ప్రభ, సిబ్బంది జె శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ మాధురి

నాటు సారా రహిత గ్రామాలకు చర్యలు

ప్రజాశక్తి - తిరువూరు : గ్రామాలను నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డిఒ మాధురి అన్నారు. తిరువూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీఓ మాధురి అధ్యక్షతన ప్రభుత్వం ఏర్పాట్లు చేసిన నవోదయం 2.0 ఆమలుపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన మండల లెవెల్ కమిటీల సభ్యులు పాల్గొని కాపుసారా తయారీ, అమ్మకాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఆర్‌డిఒకు మండలాల వారీగా వివరించారు. తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 19 గ్రామాలను నాటు సారా గ్రామాలుగా గుర్తించి వాటిని ఎ,బి,సి కేటగిరీలుగా విభజించామని ఆ శాఖ అధికారులు తెలిపారు. దీని కోసం గ్రామ, మండల లెవెల్ కమిటీలుగా విభజించి పూర్తిస్థాయిగా నాటు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఇప్పటికీ ఈ19 గ్రామాల్లో 123 కేసులను నమోదు చేసి 143 మందిని అరెస్టు చేశామన్నారు. నాటు సారా 324.5 లీటర్లు, 18 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 23,450 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. తరచూ అదే పనిగా నాటు సారా వ్యాపారం చేస్తున్న ఆరుగురిని తహశీల్దార్ ఎదుట హాజరు పరచగా వారిపై అపరాధ రుసుము విధించినట్లు వెల్లడించారు.

దర్శనానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ దర్శనానికి యాత్రికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేసవి సెలవులతో పాటు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలతో పాటు క్యూలైన్లు కిక్కిరిశాయి. యాత్రికులు అమ్మవారికి పాలు, పొంగల్ సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు యాత్రికులు వేసవి తీవ్రత దృష్ట్యా ఆలయ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆలయ డైరెక్టర్ కాకాని అలేఖ్య పంది పాల్గొన్నారు.



వీరేశలింగం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కందుకూరి వీరేశలింగం వర్ధంతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి పట్టణ శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గ్రంథాలయ సంస్థ, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జెవివి కొండపల్లి శాఖ అధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ వీరేశలింగం వితంతు వివాహాలు చేసేందుకు సంఘసంస్కరణ ఉద్యమాలను నడిపారన్నారు. స్త్రీల విద్య కోసం బాలికలకు పాఠశాలలు కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. పెట్ల కామేశ్వరరావు మాట్లాడుతూ సత్ ప్రవర్తనలో వీరేశలింగం ప్రథమ స్థానంలో ఉండే వారన్నారు. తెలుగునాట సంఘసంస్కరణ ఉద్యమాలను ప్రారంభించారన్నారు. కొండపల్లి గ్రంథాలయ అధికారి డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం నుండి నేటి వరకు జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెవివి సభ్యులు చేతన్ మురళీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.


పలు అంశాలపై పేట మున్సిపల్‌లో చర్చ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ కూటమి ప్రభుత్వం పాలకవర్గం ఏకపక్ష నిర్ణయాలు, సింగిల్ టెండర్ల విధానం కౌన్సిల్ సభ్యులకు టెండర్లు సమాచారం చెప్పకపోవడం నామినేషన్ పద్ధతిన టిడిపి కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం, టిడిపి వార్డుల్లో అభివృద్ధికి నిధులు కేటాయించడం, వాటిపైన అధికారులు క్షేత్రస్థాయిలో చర్చించారు. ముఖ్యంగా కాంట్రాక్టర్లు పనిచేసే వర్కుల మీద నాణ్యత, పురపాలక సంఘానికి కాంట్రాక్టర్లు తీసుకువచ్చే మెటీరియల్ బోరు సామాన్లు ఇతరత్రా లైట్లుపై పూర్తిస్థాయిలో నిఘా లేకపోవడం బిల్లులు చెల్లింపులు మాత్రం వారికి ఇష్టం వచ్చిన విధంగా చేసుకుంటున్నారని మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ ఆరోపణ చేశారు. వార్డుల్లో వీధిలైట్లు అత్యవసరంగా అవసరం ఉన్నవని చైర్మన్ రాఘవేంద్రను కోరారు. గత వర్షాకాలంలో వేపల వాగు పరిసర ప్రాంతాలు ఒకటో వార్డు నుంచి తొమ్మిదో వార్డు వరకు వాగుకు రెండు వైపులా ఉన్న గృహ యజమానులకు ఆస్తి నష్టం జరిగిందని వరదల వల్ల మరలా అటువంటి వరద నష్టానికి గురవకుండా చర్యలు తీసుకొని వేపల వాగు ప్రక్షాళనకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని ఈ కౌన్సిల్లో ఐదు లక్షల రూపాయలు టెండర్ పిలిచింది కేవలం ఎర్ర కాలవ వేపలవాగు చెత్త తొలగింపుకు మాత్రమే సరిపోతుందని పూర్తిస్థాయిలో ప్రక్షాళనకు సుమారుగా 15 నుంచి 20 లక్షల రూపాయలు కేటాయించాలని కోరారు. జగ్గయ్యపేట డంపింగ్ యార్డ్ వల్ల పంప్ హౌస్ వరకు వ్యర్థాలు కలిసి కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు.



కౌన్సిల్ సమావేశంలో సభ్యులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

టిడిపికి సంబంధించిన కౌన్సిల్ సభ్యురాలు కన్నబోయిన రామలక్ష్మి ఎజెండాలో లేని అంశాన్ని కూటమి ప్రభుత్వం నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతం మధ్యలో కేంద్ర ప్రభుత్వం ద్వారా డిఫెన్స్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నామని దానికి కౌన్సిల్లో తీర్మానం పెట్టి అందరూ అభినందించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా వట్టెం మనోహర్ మాట్లాడుతూ కౌన్సిల్లో లేని ఎజెండాలో లేని అంశాన్ని ఇక్కడికి చర్చకి తీసుకురావడం సమంజసం కాదని అవి అన్నీ కూడా పూర్తయిన తర్వాత కచ్చితంగా అభినందిస్తామని తెలిపారు. మున్సిపల్ అధికారులను వార్డులలో పర్యటన చేసి రోడ్డు, మార్జిన్లు, డ్రైనేజీలు, కల్వర్టులను పరిశీలన చేసి పైప్ లైన్ లీకేజీలను వార్డుల వారీగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని, శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కౌన్సిల్‌లో ఈనెల చివరిలో పదవి విరమణ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ రావు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పంపుల నుంచి నీళ్లు రాకపోవడంతో రాత్రిసమయంలో ఇలా చేతిపంపును ఆశ్రయించిన మహిళలు

అందని తాగునీరు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురం గ్రామపంచాయతీ శివారు గ్రామం వెలగలాగూడెంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు వేసేందుకు తీసిన గోతుల కారణంగా వాటర్ పైపులు పగిలిపోయి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానిక ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడింది. ప్రజలు చేతి పంపులను ఆశ్రయించ వలసి వస్తుంది. కనుక అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని, నీటికీ ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.



29 నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దేశ రైతాంగానికి సాగు సాంకేతిక పరిజ్ఞానం, రైతులకు అవసరమైన సమాచారాన్ని శాస్త్రవేత్తల ద్వారా తెలియజేసి వారి చైతన్యవంతం చేయాలనే సంకల్పంతో విక్షిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రీ- ఖరీఫ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ఆయా రాష్ట్రాల్లోని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని నిర్దేశించారు. దీనిలో భాగంగా మండలంలోని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు – ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రీసెర్చ్ శాస్త్రవేత్తలతో సంయుక్తంగా జిల్లా వ్యవసాయ అధికారులు సమన్వయంతో జిల్లాలో నిర్దేశించబడిన గ్రామాల్లో ఈనెల 29 నుండి జూన్ 12 వరకు పర్యటించనున్నట్లు డా. కె. ఎల్. రావు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్. కె. అచ్చుతా రాజు తెలిపారు. రైతులకు భూసార పరీక్ష, నీటి పరీక్షల ప్రాముఖ్యత, సాగు మెళకువలు, పంటల ఎంపిక, అధికదిగుబడినిచ్చే రకాలు, యాంత్రీకరణ సౌలభ్యం, పంటలు యాజమాన్యం, సస్య రక్షణ, పోషక యజమాన్యం, పాడి పశువుల యాజమాన్యం మెళకువలు నేర్పిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు మొదలకు గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞాన్ని తెలియజేసి వారికి ఖరీఫ్ సాగుకు సన్నద్ధంగా తయారువటానికి రైతులకు అవగాహన కల్పించబోతున్నారన్నారు. జిల్లాలోని రైతులు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో పాల్గొనాలని కోరారు.

విశ్రాంత అధ్యాపకులు ప్రతాప్ రెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో విశ్రాంత అధ్యాపకులు అల్లు ప్రతాపరెడ్డిని మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు మంగళవారం పరామర్శించారు. ఇటీవల కంటి ఆపరేషన్ అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అల్లు ప్రతాపరెడ్డిని ఆయన వైసిపి నాయకుల నడకుదిటి నాగేశ్వరరావుతో కలిసి పరామర్శించారు.



ఉంగుటూరులో...



అవనిగడ్డలో...



మొవ్వలో...

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్



బందరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రజలందరూ ఆ దిశగా దృష్టి సారించి యోగ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు.మచిలీపట్నం నగరంలోని గాంధీనగర్‌లోని ఏపీ యోగాసభ వారి ఉదయపు నడక మిత్రమండలి భవనంలో మంగళవారం తెల్లవారుజాముననే జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు..అనంతరం అక్కడి నుండి యోగా ర్యాలీ ప్రారంభించి సుమారు 70 మంది యోగా సభ్యులతో కలిసి యోగా చేయండి - ఆరోగ్యం పొందండి అని నినాదాలు చేస్తూ మచిలీపట్నం పట్టణ పురవీధుల్లో యోగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఊరేగింపుగా జడ్పీ కూడలిలోని వినాయకుడి గుడి వద్దకు చేరుకున్నారు.అక్కడ అధికారిక యోగా ర్యాలీ ప్రారంభోత్సవ సమావేశం నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి రెవెన్యూ, పోలీసు, రెడ్ క్రాస్, మునిసిపల్, ఆరోగ్య, ఆయుష్, సమాచార తదితర ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది, కృష్ణా విశ్వవిద్యాలయం, నోబుల్ కళాశాల ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థులు, చేద్దాం చేద్దాం యోగా చేద్దాం, సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే, యోగా చేద్దాం అందరి చేత చేయిద్దాం, అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సాయిబాబా గుడి వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తన స్వానుభవం వివరిస్తూ నిత్యం యోగా వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఎపి యోగ సభ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో ఐదు కేంద్రాల్లో ఉచితంగా యోగ శిక్షణ ఇస్తున్నందుకు యోగాసభ గురువులను అభినందించారు. నగరంలో చింతగుంటపాలెం, గాంధీ నగర్, శంకరమఠం గొడుగు పేట, రెడ్ క్రాస్ భవనాలలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యకర సమాజాన్ని తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, ఏపీ యోగాసభ గురువులు చింతయ్య, రమేషు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** స్థానిక కైకాల సత్యనారాయణ పురపాలక కళామందిరంలో మనుసేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం యోగా క్లాసులను మున్సిపల్ కమిషనర్ సింహద్రి మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగా క్లాసులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయము 6 నుండి 7:30 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, యోగా గురువులు తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం:** గన్నవరం మండల అభివృద్ధి అధికారిణి టి.స్వర్ణలత ఆధ్వర్యంల ోఅంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో యోగ మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. యోగ మాస్టర్ డి.నాగరాజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఉంగుటూరు:** ప్రతి ఒక్కరికి యోగాపై అవగాహన అవసరమని ఎంపిపి వడ్లమూడి సరోజినీ అన్నారు. మండల స్థాయిలో యోగాపై అవగాహన నిర్వహించడం కోసం మంగళవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం నుండి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె విమలాకుమారి, ఎంపిడిఓ ఇ సత్యకుమార్, పంచాయతీ రాజ్ ఎఇ శ్రీనివాసరావు, ఎపిఓ వినీల పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల పరిషత్ అధికారి టి విజయ సారథి, తాసిల్దార్ బి లోకరాజు ఆధ్వర్యంలో యోగ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఏజేయల్ నరసింహరావు, ఎలీషా రావు, జయలక్ష్మి, రాజేష్, విజయ్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **మొవ్వ:** యోగా ద్వారా మానసిక ఉల్లాసమే కాకుండా మనసుకి ప్రశాంత ఏర్పడి సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని మండల విద్యాశాఖ అధికారిణి-2 కె శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మొవ్వ శ్రీ మండవ జానకి రామయ్య సులోచన క్షేత్రయ్య కల్యాణ మండపంలో ఐదు రోజుల పాటు జరిగే యోగా శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమైనాయి. ఫిజికల్ డైరెక్టర్లు బి నాగ శివ, పిఎన్ బసవయ్య, శిక్షణ ఇచ్చారు. **మచిలీపట్నం రూరల్:** యోగాంధ్రా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా యంత్రాంగం నిర్వహించిన ర్యాలీలో కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష లు పాల్గొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ నుండి జిల్లా కోర్టు సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీ లో పలు సంఘాలు ప్రతినిధులు, పుర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు. మచిలీపట్టణం మండలంలోని కానూరు పంచాయతీలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివి మహేష్, బొమ్మిడి పెద ఏడుకొండలు, గోపు వెంకటరమణ, పంచాయితీ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, విఆర్ఓ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ:** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం మరియాదేవి ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బందికి యోగ శిక్షణ నిర్వహించారు. శిక్షకులు కోటేశ్వరరావు, పీఈటీలు శ్రీకాంత్ ఉదయ్ పాల్గొని సిబ్బందికి శిక్ష ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఈడి కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుడిసేవ విష్ణు ప్రసాద్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు వంగర శేషగిరిరావు పాల్గొన్నారు. **పమిడిముక్కల:** మండల అభివద్ధి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆగినపర్రు, మేడూరు, లంకపల్లి అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివద్ధి అధికారి సీతారామరాజు, పిఓపిఆర్డి డి వెంకటేశ్వరరావు, కార్యదర్శులు సాంబశివరావు, స్వామి, బాబు, నాగరాజు పాల్గొన్నారు.

జీవనశైలిలో భాగం కావాలి



ప్రజాశక్తి - విజయవాడ : మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి మార్గం వేసే యోగా విశిష్టతపై ప్రజలకు అవగాహన కల్పించి, జీవితంలో యోగాసనాల అభ్యసనను భాగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా, విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో ప్రతిరోజూ యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయని విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం బీఆర్‌టీఎస్ రోడ్డు శారదా కళాశాల వద్ద జరిగిన ఏడో రోజు యోగాసనాల కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులతో కలిసి యోగాసనాలను ప్రాక్టీస్ చేశారు. అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ప్రతినిధి సత్యనారాయణ మార్గనిర్దేశనంలో యోగాసనాల అభ్యసన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమం సందర్భంగా వీఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ యోగాసనాలు మనిషి ఆరోగ్యానికి దారిదీపాలని, ప్రతిఒక్కరూ యోగా, ధ్యానాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని, యోగాను నేర్చుకొని జీవితాంతం ఆచరించాలని సూచించారు. మన భారతీయ సంస్కృతి ప్రపంచానికి ఇచ్చిన అమూల్య బహుమతి యోగా అని, ఇది కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యానికి దృఢత్వం చేకూర్చుతుందని పేర్కొన్నారు. యోగాచరణను ఏదో ఒక్కరోజుకే పరిమితం చేయకుండా తమ జీవనశైలిలో భాగం చేసుకోవడం ద్వారా రోజువారీ పనిలో మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశముంటుందని అన్నారు. జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా.వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామత్లేహి, మెడికల్ ఆఫీసర్ డా. వై.రత్న ప్రియదర్శిని, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి అభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కూచిపూడి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని తన చాంబరులో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి కూచిపూడి గ్రామం, నాట్యకళ అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కూచిపూడి గ్రామానికి వచ్చే ఔత్సాహికులు లేదా పర్యాటకులు ఒకటి రెండు రోజులు ఆ గ్రామంలో ఉండేందుకు వీలుగా విడిది గృహాలు, కమ్యూనిటీ హాల్ లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాన్ని ఆర్థికంగా అభివృద్ధి పరచడంతో పాటు ఆదాయ వనరులను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని, దీనిలో భాగంగా గ్రామస్తులు కూచిపూడి నాట్యకళకు అవసరమైన నాట్య వస్త్రాలు, గజ్జెలు, జడలు, గిల్టు నగలు తదితర వస్తువులు తయారు చేయుటకు వారికి అవసరమైన శిక్షణ తరగతులను ఏర్పాటు చేయాలని, తద్వారా వారి జీవనప్రమాణాలు పెంపొందించేందుకు కషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, ఏపీ పర్యాటక శాఖ ఏడి లజ్వంతి నాయుడు, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మారాణి, జెడ్పీ ఇన్చార్జి సీఈవో ఆనంద్ కుమార్, పర్యాటక అధికారి రామలక్ష్మణరావు, డిఆర్‌డిఏ పీడీ హరిహరనాథ్, మొవ్వ ఎంపీడీవో విమాదేవి, తహసిల్దార్ మస్తాన్ పాల్గొన్నారు.

మాన్యువల్‌గానే కౌన్సెలింగ్ నిర్వహించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఉపాధ్యాయ బదిలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆద్వర్యంలో మంగళవారం కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి పివిజె రామారావును కలిసి వినతి పత్రం అందజేశారు. బదిలీల జీ. ఓ ప్రకారం 2021 కి ముందు ఓల్డ్ స్టేషన్ కలిగి ఉన్న వారికి, ఓల్డ్ స్టేషన్ పాయింట్స్ ఇవ్వవలసి ఉన్నప్పటికీ కొంతమంది ఎం ఈ ఓ లు నిరాకరించడంతో అనేకమంది టీచర్స్ ఆందోళన చెందుతున్నరన్నారు.ప్రస్తుతం జరగబోతున్న ప్రమోషన్స్ ను మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా జరపాలన్నారు. మ్యూజిక్ టీచర్స్ బదిలీ అప్లికేషన్ పెట్టుకొనుటకు ఈ నెల 27 కి చివరి రోజు అయినప్పటికీ ఓపెన్ కావడం లేదని, వారికి అప్లికేషన్ త్వరగా ఓపెన్ అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ఎన్ సి సి ఉపాధ్యాయుల వేకెన్సీ లిస్ట్ ను 16 ఆంధ్ర బెటాలియన్, మచిలీపట్నం వారి నుండి రప్పించుటకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.ప్రస్తుతం ప్రిఫెరెన్షియల్ కేటగిరి వారికి 50 శాతం కోరుకునే అవకాశం ఉన్న హై స్కూల్స్ ఖాళీల వివరాలన్నింటినీ విడుదల చేయాకుండా కాలయాపన చేస్తున్నారన్నారు.ఎనిమిది అకడమిక్ సంవత్సరాలు పూర్తి చేసిన వారికి కేటగిరి ల వారీగా పూర్తి స్టేషన్ పాయింట్స్ ఇవ్వాలని కోరారు. డిఈఓని కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లంకేష్, రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు, జిల్లా కార్యదర్శి ఎన్. సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు జైగం అబ్బాస్, నరేష్, సోమేశ్వరరావు, జయ ప్రకాష్ తదితరులు ఉన్నారు.



వర్షం నీరు మళ్లింపు డ్రైన్లను పూర్తి చేయండి

ప్రజాశక్తి - విజయవాడ: వర్షపు నీరు మళ్లించేందుకు నిర్మిస్తున్న డ్రైన్ పనులు త్వరగా పూర్తి చెయ్యాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం.ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం ఎంజీ రోడ్, కష్ణవేణి స్కూల్ రోడ్డు, పటమట, రాణి గారి తోట, కష్ణలంక వారధి, ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పటమట నిర్మలా కాన్వెంట్ వద్ద తరచుగా వర్షపు నీటి నిలువలు ఏర్పడటం గమనించారు. వాటిని మళ్లించేందుకు కష్ణవేణి స్కూల్ రోడ్డు వద్ద చేపట్టిన డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. డ్రైన్ నిర్మాణ పనులలో పురోగతి లేకపోవడం గమనించి, అడ్డొచ్చిన విద్యుత్ స్తంభాలను తొలగించేటట్టు చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా ఏపీ సీపీడీసీఎల్ వారి సమన్వయంతో డ్రైన్ నిర్మాణంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి రాణి తోట కష్ణలంక వద్ద గల అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఎంజి రోడ్డు, కనకదుర్గ వారధి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని నగరం సుందరంగా పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కే. షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకష్ణ నాయక్ పాల్గొన్నారు.



31న సినీనటుడు రాజేంద్ర ప్రసాద్‌కు ఎన్టీఆర్ అవార్డు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌కు ఎన్టీ రామారావు అవార్డు మొగల్ రాజపురంలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 31 సాయంత్రం బహూకరించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కొల్లూరి, బోడి ఆంజనేయ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగువారి ఖ్యాతిని నలుదిశలా వ్యాప్తి చేసిన, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు 102వ జయంతి ఉత్సవంలో భాగంగా ఈ అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. గతంలో పలువురు సినీప్రముఖులకు ఎన్టీఆర్ అవార్డు బహూకరించామని, ఈ వేడుకల్లో సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్, గృహనిర్మాణ పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి, శాసన సభ్యులు బొండా ఉమామహేశ్వర రావు, గద్దే రామ్మోహన్, మండలి బుద్ధప్రసాద్ తదితరులు అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఇదే వేదికపై వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రముఖులకు ఎన్టీఆర్ పురస్కారం ఇవ్వనున్నట్లు తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో యాజమాన్యం

ఒలింపియాడ్ అవార్డుల్లో నగర విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరానికి చెందిన ముగ్గురు విద్యార్థులు 2024-25 సంవత్సరానికి ఎస్ఓఎఫ్ ఒలింపియాడ్ పరీక్షలో అగ్రస్థానంలో నిలిచారు. అట్కిన్‌సన్ హైస్కూల్ విద్యార్థి జి.గౌతమ్ రెడ్డి ఇంటర్నేషనల్ సోషల్ స్టడీస్ ఒలింపియాడ్‌లో మొదటి ర్యాంక్ సాధించి, బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్ పొందారు. అట్కిన్‌సన్ హైస్కూల్ విద్యార్థిని సిహెచ్.కావ్యశ్రీ అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలింపియాడ్‌లో మొదటి ర్యాంక్‌ను సాధించి, బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఎస్.సెయింట్ మాథ్యూస్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి భువన్ సహర్ష్ జె, అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో కూడా మొదటి ర్యాంక్‌ను సాధించి, బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్‌ను పొందారు. 2024-25 విద్యా సంవత్సరంలో అంతర్జాతీయ ఒలింపియాడ్ విజేతలు, ఉపాధ్యాయులను గుర్తించడానికి ఎస్ఓఎఫ్, మంగళవారం డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. విజేతలకు సర్టిఫికేట్, బహుమతులు అందజేశారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి - విసన్నపేట : విసన్నపేట మండలంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద పచ్చిరొట్ట విత్తనాలైనా పిల్లిపెసర, జనుము, మిక్స్‌డ్ కిట్స్ 50శాతం రాయితీపై రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

'తరళ్' శిక్షణలో సమగ్ర శిక్ష ఎస్‌పిడి బి.శ్రీనివాసరావు


ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పునాది దశలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే భవిష్యత్తులో తమకు తామే జీవన నైపుణ్యాలు నేర్చుకోగలరని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సమగ్ర శిక్షా, ఎస్‌సిఆర్‌టి సంయుక్త ఆధ్వర్యంలో ప్రాథమిక విద్య బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయలకు మూడు రోజుల పాటు శిక్షణ ప్రారంభమైంది. ఆగిరపల్లి హీల్ ప్రాంగణంలో జరుగుతున్న ఈ శిక్షణను సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పిడి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత పాఠశాల స్థాయికి చేరుకునే సరికి కనీసం రాయడం, చదవడం, సాధారణ లెక్కలు చేయడం వచ్చేలా నేర్పించాలన్నారు. ఇదే లక్ష్యంగా ఉపాధ్యాయులు అంకిత భావంతో, బాధ్యతతో పనిచేస్తే ఎఫ్ఎల్ఎన్ అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రథమ్, తరళ్ రూపొందించిన బోధన సామగ్రి ఆవిష్కరించారు. ఎఫ్ఎల్ఎన్, తరళ్‌లో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు విదేశాలకు పంపించి అక్కడి బోధనా పద్ధతులు తెలుసుకునేలా అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో శామో జాయింట్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, హీల్ సిఇఒ అజయ్ కుమార్, శామో డిప్యూటీ డైరెక్టర్ ఎం.అనురాధా, తరల్ తెలంగాణ, ఆంధ్రా స్టేట్ హెడ్ పి.రాంబాబు, తరల్ స్టేట్ కో ఆర్డినేటర్ జి.వినోద్, సమగ్ర శిక్షా తరల్ స్టేట్ కో ఆర్డినేటర్ కల్పనా శైల, 165 మందికి పైగా స్టేట్, జిల్లా రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బి.శ్రీనివాసరావు

కూచిపూడి నాట్య పోటీల్లో బహుమతులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కళా నిలయం వారి 2025 సంవత్సరానికి గానూ 40 జాతీయస్థాయి నవరస శాస్త్రీయ జానపద సంగీత నాట్య కళారూపాల పోటీలు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో మూడు రోజుల పాటు జరిగాయి. ఇందులో కూచిపూడి జూనియర్స్ విభాగం నుండి తృతీయ బహుమతి కొండపల్లికి చెందిన సంపసాల శ్రావ్య సాధించింది. కొండపల్లిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థిని శ్రావ్య ప్రతిభ పాటవాలను ప్రశంసిస్తూ, ఉపాధ్యాయినులు విద్యార్థిని, తల్లిదండ్రులను అభినందించారు. విజయవాడకు చెందిన శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ నాట్య గురువులు సప్పా శివకుమార్ మాట్లాడుతూ శ్రావ్య బహుమతి సాధించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఈ పోటీల్లో నత్యాలయ విద్యార్థులు సీనియర్, జూనియర్ విభాగాల్లో ఏడుగురు నాట్య ప్రదర్శన చేశారని, వారిలో సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి ఎం.అక్షిత, ద్వితీయ బహుమతి వి.సాయి భవ్యశ్రీ, జ్యూరీ బహుమతి కె.హేమలత, జూనియర్ విభాగంలో తృతీయ స్థానంలో శ్రావ్య, జ్యూరీ అవార్డులు చిన్నారులు బి.శాన్వీ, డి.రీహాన్షీ జి.హిత సాయి సాధించినట్లు శివకుమార్ తెలిపారు.



కూచిపూడి నాట్య పోటీల్లో బహుమతులు అందుకుంటున్న శ్రావ్య, అక్షిత, సాయి భవ్యశ్రీ

31న ఎపి ఎన్‌జిజిఒ రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నిక

రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యాసాగర్ ఎన్నిక దాదాపు ఖరారు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల ఆకాంక్ష మేరకు ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర సంఘానికి అధ్యక్షునిగా ఎ.విద్యాసాగర్ ఎన్నిక దాదాపు ఖరారు కావడంతో ఈ నెల 31న ఆయన పదవీ స్వీకార చేసే అవకాశం ఉందని ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ నగర అధ్యక్షకార్యదర్శులు సివిఆర్.ప్రసాద్, నజీరుద్దీన్ తెలిపారు. అసోసియేషన్ విజయవాడ నగరశాఖ కార్యవర్గ సమావేశం మంగళవారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్‌జీవో హోమ్‌లో జరిగింది. సమావేశంలో నగర అధ్యక్షులుసి విఆర్.ప్రసాద్ మాట్లాడుతూ ఎపి ఎన్‌జీజీవో సంఘానికి అధ్యక్షునిగా పనిచేస్తున్న కేవీ శివారెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఎ.విద్యాసాగర్‌ను ఎన్నుకోవాలని రాష్ట్రంలో ఇప్పటికే అనేక జిల్లాల కార్యవర్గాలు తీర్మానాలు చేశాయన్నారు. ఈ నేపథ్యంలో 31న రాష్ట్ర కార్యవర్గం సమావేశం నిర్వహించి కోఆప్షన్ పద్ధతిలో విద్యాసాగర్‌ను అధ్యక్షునిగా ఎన్నుకోనున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో పోరాట పటిమగలిగిన ఏకైక నాయకుడు విద్యాసాగర్ అని, ఆయన రాష్ట్ర సంఘ పగ్గాలు చేపట్టాలని ప్రతి ఉద్యోగీ ఆసక్తితో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, డిమాండ్లు ఆయన సారధ్యంలో నెరవేరతాయని ఉద్యోగులు ప్రగాఢంగా నమ్ముతున్నారన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా కార్యవర్గం కూడా ఆయనకు మద్దతు తెలుపుతూ తీర్మానించినట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎస్ కె.నజీరుద్దీన్ మాట్లాడుతా విజయవాడలోని శేషసాయి కల్యాణమండపంలో పదవీ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఎపీ ఎన్‌జీజీవో సంఘ నాయకులు తరలి వస్తారని అన్నారు. గతంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశాలు, కార్యక్రమాలను విజయవంతం చేయడంలో నగర శాఖ కార్యవర్గానికి ఎంతో అనుభవముందన్నారు. ఈ సమావేశంలో నగర శాఖ సహాధ్యక్షుడు పి.రాజశేఖర్ కోశాధికారి డిఎస్ఎన్.శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులు మధుసూధనరావు, షేక్ ఖాసిం సాహిబ్, ఎం.శ్రీనివాసరావు, పి.విద్యాసాగర్, కె.శివశంకర్ బి.విజయశ్రీ ఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సివిఆర్.ప్రసాద్

పెట్రోల్ కల్తీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన పనిగంచిప్రోలు మునేరు అవతల పెట్రోల్ బంకులులో పెట్రోల్ పోస్తే నీళ్లు వస్తున్నాయి అంటూ ఆ గ్రామానికి చెందిన కొందరు యువకులు తహశీల్దార్ శాంతిలక్ష్మి ప్రియాకు ఫిర్యాదు చేశారు. నీళ్లు కలిసిన పెట్రోల్ పోయడం వలన తమ బైకులు పాడయ్యాయని తెలిపారు. దీనిపై నిర్వాహకులను అడిగితే సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం చేశారు. ఫిర్యాదుపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి

ప్రజాశక్తి - తిరువూరు : మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రు 68 వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ తిరువూరు కార్యాలయంలో ఆపార్టీ నేతలు కార్యకర్తలు మంగళవా రం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అయన ప్రధానిగా ఈ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు బొడ్డు ప్రకాశరావు, జీవన్ బాబు, ఇజ్జాడ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డ్వాక్రా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్స్, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఈలప్రోలు గ్రామంలో పంచాయతీ రాజ్ శాఖ ఎడిసి సుధాకర్, సెర్ప్ పిడిఎం ఎన్‌వి నాంచారయ్య, ఇతర అధికారులు మంగళవారం పరిశీలించారు. ప్రజలకు ఇంటి వద్దే కంపోస్ట్ పిట్లు తవ్వించుకొని తడి చెత్త నుండి వెర్మి కంపోస్ట్ తయారు చేసుకోవటం, గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వర్మీ తయారు చేయడం, ప్లాస్టిక్ రిసైక్లింగ్ గురించి అవగాహన కల్పించడం చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని జూపూడి, గుంటుపల్లి గ్రామాలను సందర్శించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. తదుపరి చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, రోజువారీ ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్యంపై పంచాయితీ కార్యదర్శులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డివిజన్ డిఎల్‌పిఒ జిఎల్‌ఎన్‌వి రాఘవన్, ఇబ్రహీంపట్నం మండల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.